సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



ఘనంగా తులసీదళార్చన

విశాఖ: నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళ ఆర్చనను ఘనంగా నిర్వహించారు.



సింహగిరిపై విదేశీయులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఇంగ్లండ్ దేశస్తులు దర్శించుకున్నారు.



జాతీయ సమైక్యత శిబిరానికి..

విశాఖ: పంజాబ్‌లో జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

న్యూస్‌రీల్

ఆర్‌ఐవోగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ



మురళీధర్‌ను అభినందిస్తున్న డీవీఈవో రాధ, సూపరింటెండెంట్ గణేష్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్‌ఐవో)గా పి.మురళీధర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్‌ఐవోగా పనిచేసిన రాయల సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయటంతో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న మురళీధర్‌కు ఆర్‌ఐవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఆయనకు పూర్వ ఆర్‌ఐవో సత్యనారాయణ పూర్తి బాధ్యతలను అప్పగించారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ, కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, సిబ్బంది మురళీధర్‌కు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి, ఆహ్వానించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో డీవీఈవోగా, బోర్డులో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేసిన అనుభవంతో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు.

ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష 23కు వాయిదా

- నేడు నైతికత, మానవీయ విలువల పరీక్ష యథాతథం

యలమంచిలి రూరల్: ఈనెల 3న నిర్వహించాల్సిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పర్యావరణ విద్య పరీక్షను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేస్తూ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి.వి.సుబ్బారావు పేరుతో గురువారం రాత్రి విడుదలైన ఉత్తర్వులను జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపినట్టు ఆమె చెప్పారు. పర్యావరణ విద్య పరీక్షను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాలని, ఈ సమాచారాన్ని విద్యార్థులందరికీ తెలియజేయాలని ఆమె ప్రిన్సిపాళ్లకు సూచించారు. శుక్రవారం నైతికత, మానవీయ విలువల పరీక్ష యథాతథంగా జరుగుతుందన్నారు.

ఎస్‌ఐల బదిలీ

అనకాపల్లి: జిల్లాలో ఎస్‌ఐలను బదిలీ చేస్తూ గురువారం ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి దిశ ఎస్‌ఐ డి.శేఖరంను చోడవరం పోలీస్ స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ ఎం.పాపయ్యను రాంబిల్లి స్టేషన్‌కు, ఎస్‌ఐ జె.రామారావును వీఆర్ నుంచి పాయకరావుపేట స్టేషన్‌కు, ఎస్‌ఐ ఎం.వి.రమణను వీఆర్ నుంచి నక్కపల్లి స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం ఈసీగా దేవానంద్

విశాఖ లీగల్: రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా వడ్లపాటి దేవానందరావు ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం 12వ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. 2022 సెప్టెంబర్ 12న ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.





నేటి నుంచే క్రికెట్ పండగ



విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం నుంచి జరగనున్న భారత్- ఇంగ్లండ్ రెండో టెస్ట్‌కు అంతా సిద్ధమైంది. పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఇరు జట్లు గురువారం నెట్ ప్రాక్టీస్ చేశాయి. గతంలో ఇక్కడ జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించింది. మూడో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయాలని భావిస్తోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్ మ్యాచ్ శుక్రవారం ప్రారంభం కానుంది. గతంలో ఇదే వేదికపై 2016లో తొలిసారిగా ఇంగ్లండ్‌తో భారత్ తలపడి విజయం సాధించింది. 2019లో దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్ విజేత కేతనం ఎగురవేసింది. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో భారత్ 0-1తో తొలి టెస్ట్‌ను కోల్పోగా.. రెండో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో తీవ్రంగా శ్రమించింది.

ఆశ.. నిరాశ

- కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి
- టైర్-2 సిటీల కేటగిరీలో పెరగనున్న విమాన సర్వీసులు
- వందేభారత్ బోగీల సంఖ్య పెరిగే ఛాన్స్



సాక్షి, విశాఖపట్నం: కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నో ఆశలను రేకెత్తిస్తుంది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఉత్కంఠ రేపుతుంది. బడ్జెట్‌లో తమకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయోనని అంతా ఎదురు చూస్తుంటారు. పైగా ఎన్నికల ముందు బడ్జెట్‌పై మరింత ఆసక్తిగా ఉంటారు. కానీ గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ విశాఖ వాసులను నిరాశపరచింది. ఇతమిద్ధంగా ఎలాంటి కేటాయింపులు లేకుండా సాగింది. ప్రధానంగా రైల్వే జోన్‌పై గాని, విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి గాని ఊరటనిచ్చే ప్రకటన చేయలేదు. రైల్వే జోన్‌పై డీపీఆర్ సిద్ధమైందన్న సమాచారం తప్ప ఇతరత్రా స్పష్టత కొరవడింది. కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నానికి వ్యతిరేకంగా ఉద్యమాలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ మొత్తాన్ని గతేడాదికంటే పెంచుతున్నట్టు ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో పేర్కొన్నారు. దీంతో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఆందోళనకు ఫుల్‌స్టాప్ పడలేదు. దీనిపై ఈ బడ్జెట్‌లో ఏదైనా సానుకూల నిర్ణయం వెలువడుతుందన్న ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు నిధుల కేటాయింపును కూడా విస్మరించడం ఈ ప్రాంత వాసులకు విస్మయానికి గురిచేసింది. ఇంకా విశాఖ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు గురించిన ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదు. విశాఖలో అభివృద్ధి, ఉపాధికి దోహదం చేసే కొత్తగా సంస్థల ఏర్పాటు జోలికీ వెళ్లలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ మెజార్టీ వర్గాలను నిరాశకు గురి చేసింది.

గుడ్డిలో మెల్లలా..

దేశంలోని టైర్-2,3 నగరాలకు ఉడాన్ పథకం కింద కొత్త విమాన సర్వీసులను పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా విమానయాన సంస్థలు కొత్తగా వెయ్యి విమానాల కొనుగోళ్లకు ఆర్డరిచ్చాయి. దీంతో విశాఖ విమానాశ్రయానికి మరి కొన్ని విమాన సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు చేసిన ప్రకటన ఈ రంగంలో అలరారుతున్న విశాఖకు ఒకింత ప్రయోజనం చేకూర్చే అంశంగా కనిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా 40 వేల వందేభారత్ బోగీలను ప్రవేశపెడ్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఫలితంగా విశాఖ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు ఈ ఆధునిక సదుపాయాలున్న బోగీలు అమర్చే అవకాశం కలుగుతుంది. గుడ్డిలో మెల్లలా అంతకు మించి ఈ బడ్జెట్‌లో విశాఖకు ఒనగూరిన ప్రయోజనాలు కనిపించక పోవడం విశేషం! కాగా విశాఖకు మొండి చేయి చూపించినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఆస్కారం ఉందన్న అభిప్రాయాన్ని కొన్ని వర్గాల ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు.

విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం



ఈ బడ్జెట్‌లో విశాఖకు, రాష్ట్రానికి అన్యాయం జరిగింది. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించడంపై హామీ లేకపోవడం దుర్మార్గం. బడ్జెట్‌లో 99 శాతం మందికి ఎలాంటి ఉపశమనం లేదు. కార్పొరేట్లకే తప్ప పేద, మధ్య తరగతి వారికి ప్రయోజనం లేదు. ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అనడంలో సందేహం లేదు.

– ఎం.జగ్గునాయుడు, సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కార్యదర్శి

ఉక్కు రంగానికి ఊతం



కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.11.11 లక్షల కోట్ల కేటాయింపు, పీఎం ఏవై కింద రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం, మూడు రైల్వే కారిడార్లు, ఉడాన్ స్కీంలో కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణం వంటి వాటి వల్ల ఉక్కు వినియోగం బాగా పెరుగుతుంది. ఇది ఉక్కు రంగానికి ఊతాన్నిస్తుంది. ఈ అవసరాలను తీర్చడంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కూడా పాలుపంచుకుంటుందన్న నమ్మకం ఉంది.

– అతుల్ భట్, సీఎండీ, ఆర్‌ఐఎన్ఎల్.

అభివృద్ధి, ఉపాధికి ఆస్కారం



కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు కేటాయింపులు లేకపోయినా, దేశంలోని వివిధ రంగాలకు మేలు చేసేదిగా ఉంది. మౌలిక వసతుల రంగానికి భారీగా నిధులు కేటాయించడం వల్ల రైల్వే, విమానయాన, పోర్టు తదితర రంగాల్లో పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పర్యాటకరంగ అభివృద్ధికి, సాంకేతిక రంగంలో ప్రైవేటు సంస్థల ఆర్‌అండ్‌డీకి వడ్డీ లేని రుణాలివ్వడం మంచి పరిణామం.

– ఓ.నరేష్‌కుమార్, ప్రెసిడెంట్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

కొత్త ప్రాజెక్టు ఊసే లేదు

- ఈసారీ వాల్తేరు డివిజన్‌కు అంతంత మాత్రమే కేటాయింపులు
- దువ్వాడ-ఉత్తర సింహాచలం మధ్య 3, 4వ లైన్ల నిర్మాణానికి రూ.55 కోట్లు
- విశాఖ రైల్వే జోన్‌కు రూ.9 కోట్లు



సాక్షి, విశాఖపట్నం : పద్దు వస్తోంది.. ప్రాజెక్టులు పట్టాలెక్కుతాయని ఎదురు చూసిన ప్రతిసారీ.. ఎక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు అన్నట్లుగానే మారింది వాల్తేరు డివిజన్ పరిస్థితి. ఉన్న ప్రాజెక్టులకు విదిలింపులు కూడా అంతంత మాత్రంగానే చేస్తూ.. కొత్త ప్రాజెక్టుల గురించి కనీస ప్రస్తావన లేకుండానే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రైల్వే స్టేషన్‌కు ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు కేటాయింపుల విషయంలోనూ మరోసారి అదే ధోరణి కనబరిచారు. కొత్తగా రాయగడ డివిజన్ ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి మమా.. అనిపించేశారు. వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్లు, లైన్ల మధ్యలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించిన పేర్లు బడ్జెట్ ప్రతిలో కనబడుతున్నా.. కేటాయింపులు మాత్రం భూతద్దంలో వెతికేలా ఉన్నాయి. గురువారం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ రైల్వే బడ్జెట్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోని వాల్తేరు డివిజన్‌కు జరిగిన కేటాయింపుల వివరాలివీ...

- రూ.154.28 కోట్ల వ్యయంతో వడ్లపూడి గేట్ జంక్షన్ నుంచి టై లైన్‌గా గంగవరం పోర్టు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మొత్తం 12.04 కి.మీ 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.79.58 కోట్లు కేటాయింపులు చేశారు.
- విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య 15.31 కి.మీ మేర 3వ, 4వ లైన్ల నిర్మాణానికి 159.47 కోట్లతో ప్రతిపాదనలు చేయగా ఈ బడ్జెట్‌లో రూ.55.23 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.
- పలాస-విశాఖపట్నం-దువ్వాడ మధ్య 72, 27 కి.మీ మేర బీ-రూట్ నిర్మాణానికి రూ.50 లక్షలు
- విశాఖపట్నం రైల్వే వర్క్‌షాప్‌లో కవర్డ్ షెడ్స్ విస్తరణ, మౌలిక సదుపాయాలకు రూ.11 లక్షలు
- వాల్తేరు రైల్వే స్టేషన్ పరిధిలోని పుచ్చలదిబ్బ కాలనీ రైల్వే క్వార్టర్ల అభివృద్ధికి రూ.5 లక్షలు
- దువ్వాడ-ఉత్తర సింహాచలం మధ్య రూ.302.25 కోట్లతో 3వ, 4వ లైన్ నిర్మాణానికి గాను ఈ బడ్జెట్‌లో రూ.117.18 కోట్లు కేటాయింపులు చేశారు.
- ఉత్తర సింహాచలం-గోపాలపట్నం మధ్య 2.07 కి.మీ మేర బైపాస్ లైన్ డబ్లింగ్ పనులకు రూ.వెయ్యి మాత్రమే కేటాయించారు.
- ఉత్తర సింహాచలం డబ్లింగ్ పనులకు రూ.38 కోట్లు కేటాయించారు.
- పెందుర్తి- ఉత్తర సింహాచలం మధ్య సర్ఫేస్ క్రాసింగ్‌ని తప్పించేందుకు రూ.183.65 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనలుండగా ఈ బడ్జెట్‌లో రూ.10.63 కోట్లు కేటాయించారు.

పది విద్యార్థుల విద్యాదీక్ష



విద్యా దీక్ష కంకణాలు కట్టుకుంటున్న టెన్త్ విద్యార్థినులు

యలమంచిలి రూరల్: అయ్యప్ప మాల కాదు. భవానీ దీక్ష కాదు. ఇది టెన్త్ పిల్లలు చేపట్టిన విద్యాదీక్ష. తమ తల్లిదండ్రుల ఆకాంక్షలు, గురువుల సంకల్పం, తమ లక్ష్యం నెరవేరాలన్న ఏకైక ఉద్దేశంతో టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు వినూత్న రీతిలో దీక్షలు చేపట్టారు. ఒకరికొకరు దీక్షా కంకణాలు కట్టుకుని, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల సమక్షంలో.. పరీక్షలు ముగిసే వరకూ ఈ దీక్షలు కొనసాగిస్తామని ప్రతిన బూనారు. జంపపాలెం హైస్కూల్లో టెన్త్ చదువుతున్న 34 మంది విద్యార్థులు గురువారం నుంచి పరీక్షలు ముగిసేవరకూ ఈ దీక్షలు చేపట్టారు. టెన్త్ పరీక్షలు ముగిసే వరకూ తాము టీవీలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటామని, సమయాన్ని వృథా చేయకుండా చదువుపైనే దృష్టి పెడతామని వారు స్పష్టం చేశారు. గురువారం ఉపాధ్యాయుల సమక్షంలో తమ ఇష్టదైవాన్ని స్మరించుకుని ఒకరికొకరు దీక్షా కంకణాలు కట్టుకున్నారు. వారిని హెచ్‌ఎం ఏవీహెచ్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం నేడు

భీమునిపట్నం: భీమిలి వుడా మైదానంలో శుక్రవారం నుంచి విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ - 14 చాంపియన్‌షిప్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నామని విశాఖ రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.లలిత్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీల నిర్వహణకు భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్ సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో 13 జిల్లాల నుంచి బాల, బాలికల జట్లు పాల్గొంటాయని, వారందరికీ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడలపై పిల్లలకు ఆసక్తి పెంపొందిస్తే మంచి క్రీడాకారులుగా రూపొందుతారని, ఇదే తమ లక్ష్యమన్నారు. పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని తెలిపారు. సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, అసోసియేషన్ కార్యదర్శి పి.అరుణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 93 గ్రామాల్లో బెల్లం తయారీ ప్రయోగాలు



అరబుపాలెంలో బెల్లం తయారీ పరిశీలిస్తున్న దృశ్యం


- అరబుపాలెంలో పరిశీలించిన ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్

మునగపాక: జిల్లాలో 93 గ్రామాల్లో చెరకు నుంచి బెల్లం తయారీ అంచనా ప్రయోగాలు చేపడుతున్నట్లు ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్ జి.రామారావు తెలిపారు. దేశంలో బెల్లం ఎగుమతులు, దిగుమతుల అవసరాల నిమిత్తం దాని తయారీ అంచనా ప్రయోగాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ మేరకు మునగపాక మండలం అరబుపాలెంలో బొడ్డేడ రామచంద్రరావు రైతు పొలంలో చెరకు నుంచి బెల్లం తయారీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. చెరకు నరకడం నుంచి రసం తీయడం, మరిగించిన రసం నుంచి బెల్లం తయారీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లాలో 93 గ్రామాలను ఎంపిక చేసి ఒక్కో గ్రామంలో రెండేసి వంతుల ప్రయోగాలు చేపడుతున్నామన్నారు. 51 చోట్ల మొక్క తోటలు, 42 చోట్ల కార్శి తోటల నుంచి ప్రయోగాలు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా దిగుబడులు అంచనా వేయవచ్చన్నారు. తద్వారా ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు నిర్ణయాలు తీసుకుంటాయన్నారు.

బెల్లం తయారీలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ వర్మ, ఉప గణాంకాధికారులు భవాని, శశికళ, వైకుంఠరావు, సహాయ గణాంకాధికారి చంద్రమౌళి, వ్యవసాయ సహాయకులు సత్య రవిరాజ్, వీఆర్‌ఏ శాంతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తులసి తీర్థం

ఉత్తరాంధ్రలో క్షీర విప్లవం తీసుకొచ్చిన ఆంధ్ర కురియన్ ఆదారి తులసీరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి భారీ ఎత్తున తీర్థం నిర్వహించారు. అభిమానులు, పాడి రైతులు, విశాఖ డెయిరీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



ఆదారి తులసీరావు కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆదారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి - IIలో

తహసీల్దార్లకు పోస్టింగులు

- కలెక్టరు ఉత్తర్వుల జారీ

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో పలు విభాగాల సూపరింటెండెంట్లతోపాటు పలు మండలాల తహసీల్దార్లకు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పోస్టింగులు ఇస్తూ.. గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏవోగా బి.రాజేశ్వరరావు, న్యాయ విభాగం సూపరింటెండెంట్‌గా ఎంఏ శ్రీనివాస్, భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్‌గా బి.సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌గా డి.రామమూర్తి, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం ఏవోగా పి.వి.ఎల్.ఎన్ గంగాధరరావు, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఏవోగా వి.ప్రకాష్‌రావు నియమితులయ్యారు.

మండలం	కొత్త తహసీల్దారు		
అనకాపల్లి	టి. శ్రీనివాసరావు	సబ్బవరం	జె.చలమయ్య
అచ్యుతాపురం	పి.సరోజనీ	చీడికాడ	బి.ప్రకాషరావు
బుచ్చెయ్యపేట	కె.శ్రీకాంత్	గొలుగొండ	జి.ప్రభాకరరాజు
చోడవరం	పి.వేణుగోపాలరావు	కోటవురట్ల	బి.వెంకటరమణ
దేవరాపల్లి	జి.లక్ష్మీనారాయణ	మాకవరపాలెం	బి.మురళీమోహనరావు
యలమంచిలి	ఆర్.అప్పలరాజు	నక్కపల్లి	ఎం.శ్రీకాంత్
కె.కోటపాడు	జె.ఈశ్వరమ్మ	నాతవరం	ఎన్.రమేష్‌కుమార్
కశింకోట	ఎల్.మధుసూదన	నర్సీపట్నం	కె.శ్రీరాములు
మునగపాక	బి.పాపారావు	పాయకరావుపేట	జి.ఎ. సూర్యనారాయణ
పరవాడ	ఎస్.గణపతిరావు	రావికమతం	ఎస్.రమణారావు
రాంబిల్లి	బి.అప్పలస్వామి	రోలుగుంట	కె.రవిచంద్ర
		వి.మాడుగుల	టి.సత్యనారాయణ

పండగలా ప్రారంభోత్సవాలు

కోలాటాలు.. ఆనంద హారతులు.. సర్వత్రా సంతోషకర వేడుకలు.. అవును! ఆ ఊరంతా పండగ చేసుకుంది. కె.కోటపాడు గ్రామంలో రూ.5 కోట్ల 37 లక్షలతో చేపట్టిన 9 పనులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం ప్రారంభించారు.



కె.కోటపాడులో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, పక్కన ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ అనురాధ - IIలో

క్లుప్తంగా

బాలికల గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

కోటవురట్ల: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తెలిపారు. నిర్దేశించిన అర్హతలతో ఫిబ్రవరి 23లోగా apbrafcet.apcfrr.in చిరునామాకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సమర్పించాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, బీసీ, ఓసీలు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం ఏడాదికి రూ.లక్ష దాటరాదన్నారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్‌లకు 12 శాతం వంతున సీట్ల కేటాయింపులో రిజర్వేషన్ ఉంటుందన్నారు. 5వ తరగతికి ప్రవేశ పరీక్ష వచ్చే మార్చి నెల 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరగనుందన్నారు. ఇంకా వివరాల కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు 8328409747, 9441075715 నంబర్లను సంప్రదించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థి వయస్సు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించి ఉండరాదని తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.లక్ష దాటి ఉండరాదన్నారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్‌కు 12 శాతం వంతున సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష మార్చి 10న మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరగనుందన్నారు. ఇంకా వివరాలకు ఇంటర్మీడియట్‌కు హెల్ప్‌లైన్ నంబర్లు: 6301119688, 9490671262లను సంప్రదించాలన్నారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

నర్సీపట్నం : నెల్లిమెట్ట జంక్షన్ వద్ద కారులో తరలిస్తున్న 46 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టగా చింతపల్లి వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న స్విఫ్ట్ కారులో దుండగులు పోలీసులను చూసి కారు దూరంగా నిలిపి పరారయ్యారు. కారులో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీసులు కారు సీజ్ చేశారు. గంజాయి తరలిస్తూ పరారైన వారిలో కొయ్యూరు మండలం, కంఠారంకు చెందిన ఎస్.భాస్కర్ రావు(26), చింతపల్లి మండలం, రాళ్ళగెడ్డకు చెందిన వంతల రాముగా గుర్తించామని, వారి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పండగలా..ప్రారంభోత్సవాలు

- కె.కోటపాడులో రూ.5.37 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సీసీ రోడ్డు, డ్రెయినేజీ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : ప్రజలకు మంచి చేయాలన్న ఆశయంతోనే సీఎం జగన్ సుపరిపాలనను అందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన 4 ఏళ్ళ 9 నెలల కాలంలోనే 18 అభివృద్ధి పనులు సుమారు రూ.16 కోట్లతో జరిగాయి. వీటి ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం రూ.5.37 కోట్లతో పూర్తి చేసుకున్న 9 అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభోత్సవం చేశారు. కె.కోటపాడు గ్రామానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వందలాది మంది ఆయన వెంట సాగడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కె.కోటపాడులో రూ.25 లక్షలతో నిర్మాణం జరిపిన రావాలమ్మ ఆర్చి నుండి మేడపురెడ్డివారి కళ్ళాల వరకూ సీసీ రోడ్డు, డ్రెయినేజీ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం రూ.15 లక్షల వ్యయంతో విశ్వబ్రాహ్మణుల సామాజిక భవనం, రూ.7లక్షలతో నిర్మాణం చేపట్టిన గొల్లపేట సామాజిక భవనం, రూ.8లక్షలతో దిగువ యాతపేట సీసీ రోడ్లు, డ్రెయినేజీ, రూ.15లక్షలతో షరాబుపేటలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ.25లక్షలతో బజారు నుండి దిగువ యాతపేట, గొల్లపేట వరకూ సీసీ రోడ్లు, డ్రెయినేజీ, నాడు–నేడు నిధులు రూ.80 లక్షలతో జూనియర్ కళాశాలలో జరిగిన అభివృద్ధి పనులు, రూ.22 లక్షలతో నిర్మాణం జరిపిన హెల్త్‌వెల్‌నెస్ భవనం, రూ.3.60 కోట్లతో పూర్తయిన మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఎగువ యాతపేటలో రూ.10లక్షలతో నిర్మాణం జరపనున్న సామాజిక భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో గ్రామాల్లో అభివృద్ధి కనుచూపు మేర కనిపించేది కాదన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు గ్రామాల్లో అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని ప్రాధాన్యం కల్పిస్తున్నారని, ఇందుకు నిదర్శనమే కె.కోటపాడు గ్రామమని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని ఈ కొద్ది కాలంలోనే చేసి చూపించారని చెబుతూ డిప్యూటీ సీఎంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపి, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అల్లు సూర్యనారాయణ, ఎంపీటీసీ బంగారి లక్ష్మి, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, ఏఈలు బాలాజీ అప్పారావు, అల్లు శ్వేత, జి.లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూరె బాబూరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, మండల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పైల అమ్మాజీ, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, ఏటుకూరి రాజేష్, ఉమాశంకర్, వంటాకు అప్పాజీ, రామునాయుడు, శ్రీకాంత్ శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.



హెల్త్ వెల్‌నెస్ భవనానికి ప్రారంభోత్సవం చేస్తున్న జెడ్పీటీసీ అనురాధ

పదేపదే పట్టుబడితే రూ.2 లక్షల జరిమానా

- ఎస్ఈబీ సీఐ సునీల్ కుమార్



నర్సీపట్నం: సారా, అక్రమ మద్యంతో పదే పదే పట్టుబడితే రూ.2 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని నర్సీపట్నం ఎస్ఈబీ సీఐ కె.సునీల్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాల్లో సారా తయారీ, విక్రయిస్తున్న 62 మందిపై బైండవర్ కేసులు పెట్టామన్నారు. ఏడాదిలోపు మరలా సారాతో పట్టుబడితే రూ.2 లక్షలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. సారా, అక్రమ మద్యానికి సంబంధించి 48 కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి, మద్యం నిల్వలకు వినియోగించే అవకాశం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లో అపరిచిత వ్యక్తులకు ఇళ్లు, గోడౌన్‌లు అద్దెకు ఇవ్వకూడదన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన 155 వెహికల్స్ ఉన్నాయన్నారు. 22 వాహనాలకు వేలం నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిసారించాలన్నారు. ఈజీ మనికి యువత అలవాటు పడి గంజాయి కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. నాటు సారా, అనధికారిక మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వలంటీర్ల సేవాస్ఫూర్తి



విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొబ్బాది గురువులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ తెర్లాపు నూకరాజు

దేవరాపల్లి: గిరిజన పంచాయితీ చింతలపూడి శివారు వంతెవానిపాలెం వలంటీర్ తెర్లాపు నూకరాజు మానవత్వం చాటారు. వంతెవానిపాలేనికి చెందిన గిరిజనుడు బొబ్బాది గురువులు గుండెపోటుకు గురికావడంతో విజయనగరం మహారాజ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సుమారు 50 కిలోమీటర్ల మేర బస్సులో ప్రయాణించి అక్కడికి చేరుకొని పింఛన్ సొమ్ము అందజేసి బాసటగా నిలిచారు. తన సొంత ఖర్చులతో విజయనగరం జిల్లాలోని ఆస్పత్రికి చేరుకొని పింఛన్ సొమ్ము అందజేసిన వలంటీర్ నూకరాజుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ

మాకవరపాలెం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి వలంటీర్ పింఛను నగదు అందించింది. మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన లాలం గంగరాజు గుండెపోటు కారణంగా విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వలంటీరు సుర్ల సూర్యకుమారి గురువారం ఆస్పత్రికి వెళ్లి పింఛను నగదును పంపిణీ చేసింది.

అనుమానాస్పదస్థితిలో వలంటీర్ మృతి





వలంటీర్ హరి(ఫైల్), మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, సీఐలు

మాకవరపాలెం : అనుమానాస్పద స్థితిలో వలంటీర్ మృతి చెందాడు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన నడింపల్లి హరి(24) వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి 9 గంటల వరకు ఇంటి వద్దనే ఉన్న హరి బయటకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గ్రామ శివారున గల పంట భూమిలో గురువారం మధ్యాహ్నం మృతిచెంది కనిపించాడు. విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో తొలుత స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుతోపాటు నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు హరి, గణేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో ఎవరైనా హత్య చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే క్లూస్ టీంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వలంటీర్ హరి గురువారం ఒకటోతేదీ కావడంతో పింఛన్ల పంపిణీకి నగదు తీసుకున్నాడని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నగదు కోసం ఎవరైనా హరిని హతమార్చారా లేక వివాహేతర సంబంధం ఏదైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి ఒక సోదరుడు ఉన్నాడు. హరి మృతితో కుటుంబీకులు సంఘటన ప్రాంతానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు.

రూ.40 లక్షల విలువ చేసే పైపులు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం : తాగునీటి పైపులైన్‌కు వాడే పైపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు విలువ చేసే పైపులు దగ్ధమయ్యాయి. మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం రూ.167.89 కోట్ల భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. పైపులైన్లు వేసేందుకు అవసరమైన ప్లాస్టిక్ పైపులను పెదబొడ్డేపల్లి విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డు పక్కన నిల్వ చేశారు. వీధుల్లోని చెత్తను తీసుకొచ్చి పైపులు సమీపంలో వేస్తున్నారు. గురువారం ఆ దారిన వెళ్లే వారు సిగరెట్టు లేక అగ్గిపుల్ల విసిరి ఉండవచ్చని, లేదా ఎవరైనా చెత్తకు నిప్పు పెట్టడం వల్ల మంటలు వ్యాపించి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. పైపులు కాలి దట్టమైన పొగలు వ్యాపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఆసరాతో వెలుగు రేఖలు

ఇంటికి మహిళలే మహారాణులు. అటువంటి మహిళలకు ఆర్థిక స్వావలంబన అందించి సాధికారత కల్పిస్తోంది జగనన్న ప్రభుత్వం. ఇచ్చిన మాట ప్రకారం రుణ మాఫీ చేయడంతో పాటు స్త్రీనిధి, చేదోడు పథకాలతో ఆర్థిక సహకారం అందించడంతో లక్షలాది పేద మహిళల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ప్రభుత్వం ఇచ్చిన భరోసా ఎందరో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ పోషణలో చేదోడుగా నిలుస్తున్నారు...

నాడు కూలీ...నేడు వ్యాపారి



వంటకాలు తయారు చేస్తున్న బుద్ధ లక్ష్మి

యలమంచిలి : యలమంచిలి మండలం, లైను కొత్తూరు కాలనీకి చెందిన బుద్ధ లక్ష్మికి భర్త చనిపోయి 12 ఏళ్లు అవుతోంది. కుటుంబాన్ని పోషించుకోవడానికి గతంలో కూలి పనులకు వెళ్లేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె కుటుంబానికి ×ఆసరా౯ లభించింది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇంటి దగ్గర హోమ్ ఫుడ్స్ తయారు చేసుకుంటూ క్యాంటీన్ ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారం ప్రారంభించింది. ఆసరా నాలుగు విడతలు కలిపి రూ.41 వేలు ఆమె ఖాతాలో జమ అయింది. దీంతో ఫంక్షన్లకు వంటలు సరఫరా చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంది. దీనికి తోడు స్త్రీ నిధి రుణం రూ.50 వేలు, బ్యాంకు లింకేజి రుణం రూ.1.50 లక్షలు, జగనన్న తోడు రూ.10 కూడా ఆమెకు దక్కింది. ఆ డబ్బులతో వ్యాపారం చేసుకుని కూతురిని డిగ్రీ, కుమారుడిని ఐటీఐ చదివించుకుంటున్నానని, ఇందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సాయమే కారణమని కృతజ్ఞతలు తెలిపింది.

ప్రభుత్వ సాయమే... పెట్టుబడిగా..



టిఫిన్ దుకాణంలో అరుణకుమారి

దేవరాపల్లి : ఆమె పేరు ఆసపు అరుణకుమారి. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి గ్రామం. భర్త రోడ్డు పక్కన పకోడీ తయారు చేసి విక్రయించి కుటుంబాన్ని పోషించేవాడు. వారికి ఇద్దరు కుమారులు. వచ్చే ఆదాయం ఏమాత్రం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాల రూపంలో అందించిన ఆర్థిక సహకారంతో టిఫిన్ దుకాణం పెట్టారు. ఆసరా పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.12,500 చొప్పున నాలుగు విడతల్లో రూ.50 వేలు అందింది. బ్యాంక్ లింకేజీ ద్వారా లక్ష రూపాయలు, స్త్రీనిధి ద్వారా రూ.50 వేలు రుణం తీసుకున్నారు. భార్య, భర్త ఇద్దరూ కలిసి ఉదయం, సాయంత్రం టిఫిన్ దుకాణం నడుపుతూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని హాయిగా నడుపుతున్నారు. పిల్లలను చదివించుకుంటున్నారు. టిఫిన్ షాపు పెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా.. పెట్టుబడికి డబ్బులు లేక సాధ్యపడలేదని, సీఎం జగన్ సహకారంతో తన కల నెరవేరిందని అరుణకుమారి ఆనందంగా చెప్పింది.

చిరు వ్యాపారానికి చేదోడు..



చెరకాంలో కిరాణా దుకాణం నెలకొల్పి నడుపుతున్న నడిగట్ల లక్ష్మి

కోటవురట్ల : అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో చెరకాం గ్రామానికి చెందిన నడిగట్ల లక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ ఆసరా పథకం ఆర్థిక భరోసా అందిస్తోంది. ఆసరా నగదుతో సొంతంగా కిరాణా దుకాణాన్ని నెలకొల్పి వ్యాపారాభివృద్ధితో కుటుంబానికి చేదోడుగా నిలుస్తోంది. ఆమెది పేద కుటుంబం. భర్త శ్రీనివాసరావు కూలి పని చేస్తారు. ఇద్దరు పిల్లలు. కుమార్తె రత్నకుమారి, కుమారుడు జగన్. భర్త సంపాదనతో కుటుంబ అవసరాలు తీరకపోవడంతో ఇంట్లో చిన్న హోటల్ పెట్టుకొని అరకొర ఆదాయంతో కుటుంబానికి చేదోడుగా నిలుస్తుండేది. ఆమె శ్రీ వెంకటేశ్వర స్వయం సహాయక సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. వైఎస్సార్ ఆసరా కింద నగదు బదిలీ ద్వారా విడతల వారీగా మొత్తం రూ.56 వేలు రుణ మాఫీ సొమ్ము వచ్చింది. వైఎస్సార్ ఆసరా మొదటి విడత రుణమాఫీ నగదు రావడంతో ఆ డబ్బులు పెట్టుబడిగా పెట్టి చిన్న హోటల్ స్థానంలో మూడేళ్ల క్రితం తన గ్రామంలోనే కిరాణా దుకాణం నెలకొల్పింది. వ్యాపారం బాగా సాగడంతో నెలకు రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. దీంతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయని లక్ష్మి ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీని అమలు చేసి తమ లాంటి కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అంగరంగ వైభవంగా తులసీ తీర్థం

- తులసీ ఘాట్ వద్ద కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- 10 వేల మందికి అన్నసమారాధన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు



ఉత్సాహంగా ఎడ్ల పందాలు



గుర్రం రథంపై తులసీరావు చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగిస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న గిరిజన కొమ్ము నృత్యాలు



ఆకట్టుకున్న తీన్మార్ వాయిద్యాలు

యలమంచిలి: దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు తీర్థం యలమంచిలి మున్సిపాలిటీ పెండిపాలెంలో తులసీరావు ఘాట్ వద్ద గురువారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తులసీరావు అభిమానులు, పాడి రైతులు, విశాఖ డెయిరీ కి చెందిన పాల సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి తులసీరావుతో ఉన్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతకు ముందు తులసీరావు కుమారుడు విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో యలమంచిలి పట్టణంలో ఆడారి తులసీరావు స్వగృహం నుంచి ఆయన చిత్రపటాన్ని గుర్రాల రథంపై ఊరేగించారు. పట్టణంలోని తులసీనగర్‌లోని పాతవీధి రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రధాన రహదారి గుండా పాత జాతీయ రహదారిపై డప్పు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలు, మహిళల కోలాటం, చిడతలు, నేలవేషాలు, తీన్మార్ డప్పులు, థింసా నృత్యాలు, సాము గరిడీలు, తప్పెటగుళ్లు, చిటికెల భజన తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో తులసీ ఘాట్ వరకు అశేష జనసంద్రం మధ్య ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తులసీరావు కాంస్య విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. తులసీరావు విగ్రహానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తులసీ ఘాట్ వద్ద 10 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. తీర్థం వద్ద రంగులరాట్నాలు, ఊయలలు, జెయింట్‌వీల్ ఎక్కి ప్రజలు ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం కళాప్రదర్శనలను చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తరలివచ్చిన ప్రముఖులు

ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, గొంతిన నాగేశ్వరరావు, యలమంచిలి మండలం ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ చిన్నా, కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల కొండబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు ఆడారి వెంకట్, ఆడారి నాయుడు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్, మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ సిలబస్‌పై హర్షం

విశాఖ విద్య: ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ సిలబస్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండటం ఎంతో హర్షించదగ్గ విషయమని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగుళూరులో ఇప్పటికే 40 పాఠశాలల్లో ఐబీ సిలబస్ బోధన జరుగుతుందన్నారు. ఎల్‌కేజీకి రూ.5 లక్షల వరకు ఫీజు ఉంటుందని, అలాంటిది మన ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగానే ఐబీ సిలబస్‌తో చదువుకునే అవకాశం కల్పిస్తుండటం విద్యారంగంలో గొప్ప మార్పు అన్నారు. దీన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులు, మేధావులు స్వాగతించాల్సిన విషయమన్నారు.

అప్పన్న సన్నిధిలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే భువనేశ్వర్ జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు.

గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

క్లుప్తంగా

అనకాపల్లి ఎంపీడీవోగా మురళీకుమార్



అనకాపల్లి: స్థానిక మండల పరిషత్ అధికారిగా పి.మురళీకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన కె.వి.నరసింహారావు తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

కశింకోట ఎంపీడీవోగా శేషుబాబు



ఎంపీడీవో శేషుబాబుకు మొక్కను అందజేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

కశింకోట: స్థానిక ఎంపీడీవోగా కె.శేషుబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయనగరం జిల్లా ఎస్.కోట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనను ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఏవో ఎ.ఎ. ఖాన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఇక్కడ పని చేసిన వి.వి.రవికుమార్ తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో షెడ్లను తొలగిస్తున్న రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి గ్రామంలో ప్రభుత్వస్థలంలో అనధికారికంగా నిర్మించిన షెడ్లను రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. సర్వేనంబర్ 357లో కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్లు నిర్మించుకున్నారు. ఈ నిర్మాణాలను తొలగించేందుకు అధికారయంత్రాంగం రంగంలోకి దిగింది. ఆక్రమణదారులు అడ్డుకోకుండా పోలీసుల సాయంతో రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు షెడ్లను తొలగించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,231 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,410	3,410
మొదటి రకం	3,800	4,030
రెండో రకం	3,560	3,790
మూడోరకం	3,280	3,550

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
ధీర	: పర్తిసాయి
కిస్మత్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-9 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-44 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 269 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 231 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వేకువనే వెలుగు రేఖలు



భీమునిగుమ్మంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



కోట్నీవీధిలో వృద్ధునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



తాకాశివీధిలో మంచంపై ఉన్న వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

- ఠంచన్‌గా పింఛన్ పంపిణీ
- లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు

అనకాపల్లి: గత టీడీపీ పాలనలో పింఛన్ పొందేందుకు వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వ్యాధులతో మంచాలపై చికిత్స పొందే వారిని ఆటోలు, రిక్షాల్లో కుటుంబ సభ్యులు తీసుకువచ్చి పింఛన్లు కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కావలసి వచ్చేది. సర్వర్లు పనిచేయక పోవడం.. ఇతర కారణాలతో మరోసారి రావాలని చెప్పడంతో వెనుతిరిగి వెళ్లే దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెల 1వ తేదీన సూర్యోదయానికి ముందే ఠంఛన్‌గా ఇళ్ల వద్ద వలంటీర్లు పింఛన్లు అందజేస్తుండడంతో వృద్ధుల ఆనందోత్సవానికి అవధులు లేకుండా పోయింది. వైఎస్సార్ పెన్షన్ కానుకతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఒకటో తేదీనే పింఛన్లు చేతికి రావడంతో దర్జాగా బతుకుతున్నామని చెబుతున్నారు. పింఛన్ నగదును రూ.3వేలకు పెంచడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ తీసుకునే వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో ఉన్నా వలంటీర్లు అక్కడికి వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. ఎంత దూరంలో ఉన్నా వెదుక్కుని వెళ్లి నగదు అందిస్తున్నారు.

వివరాలు	పింఛన్ దారులు మండల పరిధి	నగదు రూ.లలో	పింఛన్ దారులు జోన్ పరిధి	నగదు రూ.లలో
వృద్ధులు	6,673	20,01,900	5059	1,51,77,000
చేనేత కార్మికులు	49	1,47,000	90	2,70,000
వికలాంగులు	1649	49,47,000	1322	39,66,000
వితంతువులు	3856	1,15,68,000	3131	93,93,000
కల్లుగీత కార్మికులు	57	1,71,000	49	1,47,000
అభయహస్తం	505	2,52,500	128	64,000
ట్రాన్ జండర్స్	02	6,000	3	9,000
మత్స్యకారులు	19	57,000	10	30,000
ఒంటరి మహిళలు	258	7,74,000	301	9,03,000
ట్రేడిషనల్ కొబర్స్	20	60,000	39	117,000
డప్పు కళాకారులకు	30	90,000	18	54,000
సైనిక్ వెల్ఫేర్	1	5,000	-	-----
మొత్తం	13,119	3,80,96,500	10,151	3,01,33,000

ఆనందంగా ఉంది



15 సంవత్సరాల నుంచి పింఛన్ తీసుకుంటున్నాను. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏటా పింఛన్ పెంచుతూ వచ్చింది. గత నెల నుంచి రూ.3వేలు అందుకుంటున్నాను. నాకెంతో ఆనందంగా ఉంది.

– సుంకర కనకరత్నం, అనకాపల్లి

ఇంటి వద్దే..



ఒంటరి మహిళలకు పింఛన్ అందించడం చాలా గొప్పతనం. రూ.3వేలకు పెంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. జగన్‌కు రుణపడి ఉంటాను. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా.

– తుమ్మల లక్ష్మి, అనకాపల్లి

ఠంఛన్‌గా పింఛన్...



ఠంఛన్‌గా ఒకటోతేదీ తెల్లవారే సరికి తలుపుతట్టి మరీ వలంటీర్లు పింఛన్ ఇవ్వడం ఆనందంగా ఉంది. గతంలో పింఛన్ కోసం నానా అవస్థలు పడేదాన్ని. రూ.3వేల పింఛన్ ఇంటిఖర్చులకు ఉపయోగపడుతోంది. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటాం. – భీముని వెంకటలక్ష్మి, అనకాపల్లి

తీరిన సాగునీటి కష్టాలు



కట్టుబోలు సమీపంలో శారదా నదిలో నీరు



మురకాడ సమీపంలో రబీ వరి నాట్లు

- శారదా నదిలో పుష్కలంగా నీరు
- రబీ వరి సాగు పనుల్లో అన్నదాతలు

రాంబిల్లి : రబీ వరి సాగుకు సాగునీటి కష్టాలు తప్పాయి. శారదా నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ ఏడాది రబీ వరి సాగు చేసే రైతులు సాగునీరు కోసం ఇబ్బందులు పడే అవకాశాలు లేవు. గత ఏడాది రబీ సీజన్‌కు సాగునీరు సమస్య లేకుండా పోయింది. వేసవి కాలంలోనూ గత ఏడాది శారదా నదిలో నీరు ప్రవహించింది. ఈ ఏడాది కూడా శారదా నదిలో నీరు ప్రవహిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిమిలి, కుమ్మరాపల్లి, మర్రిపాలెం, రజాల తదితర గ్రామాల పరిధిలో రబీ వరి సాగు జరుగుతోంది. ఇప్పటికే పలుచోట్ల వరి నాట్లు పూర్తి కాగా పలుచోట్ల వరినాట్లు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా 80 శాతం రాయితీతో వరి విత్తనాలను సరఫరా చేసింది. రైతులు ఈ విత్తనాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ విత్తనాలతో వచ్చిన నారును రైతులు పెంచుతున్నారు. మరో వారం, పది రోజుల్లో ఈ నారును నాట్లు వేయనున్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తామని అలాగే రైతులకు పొలం బడి కార్యక్రమాలు ద్వారా రైతులకు అవసరమైన సాగు – ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరిస్తామని ఏవో సుమంత తెలిపారు.



కోటవురట్లలో కమ్ముకున్న పొగమంచు

కమ్ముకున్నపొగమంచు..
జీడికి పొంచి ఉన్న ముప్పు

కోటవురట్ల : మైదానంలో మంచుపోటు జీడిరైతులను కలవరపరుస్తోంది. సంక్రాంతి వెళ్లాక మంచు తీవ్రత పెరిగింది. మంచుతో పాటు చలిగాలులు కూడా వీస్తున్నాయి. పొగమంచు దట్టంగా అలుముకుంటోంది. ప్రస్తుతం జీడి, మామిడి తోటలు పూత దశలో ఉన్నాయి.

ఈ పొగమంచుతో పూత మాడిపోతుందని, పిందె కూడా రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 3 వేల హెక్టార్లలో మామిడి, జీడి తోటలు ఉన్నాయి. ఎక్కువ మంది రైతులు జీడితోటల ఆదాయంతో జీవనం సాగిస్తారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు



హెచ్‌డీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

ఎస్.రాయవరం : ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా రోగులకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ కోన లోవలక్ష్మి అన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో అవసరమైన మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులు కేటాయిస్తుందన్నారు. అయితే గ్రామాల నుంచి సిబ్బంది తీరుపై ఫిర్యాదులు తరచూ వస్తున్నాయన్నారు. వైద్యాధికారి సిబ్బందిని నిత్యం పర్యవేక్షించి విధులు సక్రమంగా నిర్వర్తించేలా చూడాలన్నారు. తీరు మార్చుకోని సిబ్బంది ఉంటే కమిటీ దృష్టికి తీసుకు వస్తే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించిన మొదటి విడత సురక్ష ప్రత్యేక ఆదరణ చూసి, రెండో విడత సురక్ష కార్యక్రమాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శక్తి ప్రియ, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ గోవిందు, పలు గ్రామాల సర్పంచ్‌లు గణేష్, సత్యం ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన



పోటీలకు హాజరైన విద్యార్థులు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాలలో భారతవికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు మంచి స్పందన లభించింది. దేశ సంస్కృతి సంప్రదాయాలు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలకు 10 పాఠశాలల నుంచి 180 విద్యార్థులు హాజరయ్యారు. పరిషత్ కార్యదర్శి ఎస్.ఎ.బి.వర్మ, కన్వీనర్ వై.కేశవరావు, సభ్యులు ఉమామహేశ్వరావు, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

యలమంచిలి: మున్సిపాలిటీ పరిధిలోని పెండిపాలంలో గురువారం ఆడారి తులసీరావు తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్లబళ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. 23 బళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జై వీరాంజనేయ (దేవరాపల్లి) ఎడ్లబండి ప్రథమ బహుమతి (రూ.30 వేలు) సాధించింది. భూర తేజశ్రీ (నర్సాపురం) బండి ద్వితీయ (రూ.25 వేలు), శ్రీఆంజనేయం బండి (కేజే పురం) తృతీయ (రూ.20 వేలు), పరవాడ నాయుడు ఎడ్లబండి (అర్జునగిరి) నాలుగు (రూ.18 వేలు), మైచర్ల శివకుమార్ ఎడ్లబండి (చుక్కపల్లి) ఐదు (రూ.15 వేలు),వెంకటకోమలి ఎడ్ల బండి (లెక్కలవానిపాలెం) ఆరు (రూ.12వేలు), గండి వెంకట్రావు బండి (వాయలపాడు) ఏడు (రూ.10 వేలు), మహదేవ్ మోహన్ శ్యామ్‌కుమార్ ఎడ్లబండి (లక్ష్మీపురం) ఎనిమిది (రూ.8 వేలు), పాలపర్తి రామునాయుడు ఎడ్లబండి (కలగాడ) తొమ్మిదవ బహుమతి (రూ.6 వేలు) సాధించాయి.

సంతలో తగ్గిన ఉల్లి ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లి ధర తగ్గింది. టమాటా ధర పెరిగింది. కిలో ఉల్లిపాయల ధర రూ.25 నుంచి రూ.20కి తగ్గింది. టమాటా రూ.20 నుంచి నాణ్యతను అనుసరించి రూ.40 వరకు పెరిగింది. బంగాళాదుంప రూ.20, క్యాబేజీ, వంకాయ రూ.30, క్యారెట్, బీట్రూట్, క్యాప్సికం రూ.40, చిక్కుడు రూ.వంద, వెల్లుల్లి రూ.350 ధరతో అమ్మకాలు సాగాయి.

న్యాయవాదుల వంటావార్పు

అనకాపల్లి: భూహక్కుచట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక న్యాయస ముదాయం ముందు గురువారం న్యాయవాదులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్, కార్యదర్శి సూర శ్రీనివాసరావు, వెంకటరావు, అడపా సుధాకర్, ఎంజేవీఎస్‌కే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నూనెగింజల విత్తనాల పంపిణీ

మునగపాక : అరబుపాలెంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా వంద మంది రైతులకు పొద్దు తిరుగుడు, నువ్వు విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు మాట్లా డుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు ఉచితంగాఅందజేయడం అభినందనీయమన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయం

- సమన్వయకర్త మలసాల భరత్



మోసయ్యపేటలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో మమేకమైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా అందరూ కష్టించి పని చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. మండలంలోని మోసయ్యపేటలో గురువారం పార్టీ శ్రేణులు, అభిమానులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తూ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చారని చెప్పారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, రూ.3 వేలకు పింఛన్ల పెంపు తదితర నవ రత్నాలను అమలు చేశారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మరోవైపు గ్రామాల్లో రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణం, నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి తదితర కార్యక్రమాలతో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. వీటిని విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ మరింత బలపడేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు సహకారం అందించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, వియ్యపు భూలోకనాయుడు, గోకివాడ గోవింద్, అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదల సోమేష్, మాజీ సర్పంచ్ మిస్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన మోదీ



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

అనకాపల్లి: దేశాన్ని ప్రపంచస్థాయిలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు అన్నారు. స్థానిక ఉడ్‌పేటలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించినట్టు తెలిపారు. పార్లమెంట్ కన్వీనర్ బి.వి.ఎస్. వర్మ, రాష్ట్ర నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి, పట్టాభి ప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా నాయకులు రవిరాజు, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, సీనియర్ నాయకుడు శర్మ పాల్గొన్నారు.

రేపు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



గౌరీ పరమేశ్వరులు

మునగపాక: మునగపాక గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా క్రమం తప్పకుండా ఫిబ్రవరి మొదటి శనివారం ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తుల సహకారంతో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉత్సవకమిటీ చైర్మన్, కార్యదర్శి పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడులు తెలిపారు.ఉత్సవం రోజున తెల్లవారు 4 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. అదే రోజు రాత్రికి గ్రామంలో నేల వేషాలు అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మునగపాకలో ఈ నెల 3న జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు(కన్నబాబు)కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వ వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించాలన్నారు. అందరినీ కలుపుకొని ఉత్సవంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉత్సవ కమిటీ చర్యలు తీసుకోవాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దిశ పోలీస్ స్టేషన్ సీఐగా దీనబంధు



అనకాపల్లి: స్థానిక దిశపోలీస్ స్టేషన్ సీఐగా దీనబంధు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబిల్లి పోలీస్ స్టేసన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి, పదోన్నతిపై ఇక్కడకు సీఐగా వచ్చినట్టు చెప్పారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ టి.లక్ష్మి విశాఖ రేంజ్ వీఆర్‌కు వెళ్లారు.

డీఎస్సీకి క్యాబినెట్ ఆమోదంపై హర్షం

అనకాపల్లి: డీఎస్సీ నిర్వహణకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, ఉపాధ్యక్షుడు అల్లు రాజు, జిల్లా కమిటీ సభ్యులు పొంగి చలపతి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు.

విశ్వకర్మ యోజనపై సెమినార్ రేపు

తుమ్మపాల: పట్టణంలో వి.వి.రమణ రైతుభారతిలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఈ నెల 3న సెమినార్ కమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీను ఓ ప్రకటనలో తెలిపారు. మన దేశ సంప్రదాయ చేతి వృత్తులను, సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడానికి, ప్రోత్సహించడానికి, కళాకారులకు సాయం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ యోజనను ప్రారంభించారని తెలిపారు.